


# 90ఏళ్లకు చేరిన ఉత్తరం....

ఉత్తరాలు ఆలస్యంగా చేరడం మనదేశంలోనే కాదు. ఏ దేశంలోనైనా మామూలే ఈ సంఘటనే నిదర్శనం. పోయింది అనుకున్న ఓ ఉత్తరం 90 సంవత్సరాల తరువాత అడ్రస్ వెతుక్కుంటూ వారసుల దగ్గరికి చేరింది. ఈ సంఘటన వివరాలు.....

లండన్‌కు చెందిన పెర్సి బెట్మన్,తన పార్టనర్ గ్రేస్‌తో కలిసి ఓ పార్టీ ఇచ్చాడు. ఆ పార్టీకి బఫి అనే స్నేహితుడిని కూడా ఆహ్వానించారు. పార్టీ అనంతరం, కృతజ్ఞతలు తెలుపుతూ బఫీ ఆ దంపతులకు ఓ ఉత్తరం రాశాడు. అది మధ్యలో పోయింది. ఆ ఉత్తరం చివరికి జాన్ బెర్రెట్ చేతికి చేరింది. ఆ ఉత్తరం ఎవరిదో? ఎవరు ఎవరికి రాశారో తెలుసుకోవడానికి జాన్ బెర్రెట్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. స్నేహితులు, బంధువులు ఎవ్వరూ ఈ మిస్టరీని చేధించలేకపోయారు. చివరికి బెట్మన్ కూతురు 85 సంవత్సరాల స్టెల్లా చేతికి ఆ ఉత్తరం ఎట్టకేలకు చేరింది.

జాన్ ఆ ఉత్తరం ఎవరిదో కనుక్కునే వేటలో చార్లెస్ అనే వ్యక్తిని కలవడం జరిగింది. చార్లెస్ పెర్సీ ఫ్యామిలీ ఫ్రెండ్. చార్లెస్‌కు బఫీ గురించి తెలుసు. చార్లెస్ అసలు మిస్టరీ అప్పుడు విప్పింది. 1919లో పెర్సి బెట్మన్ అతని గర్ల్ ఫ్రెండ్ గ్రేసి కలిసి బాక్సింగ్ డే నాడు వెమౌత్‌లోని అబ్బాట్స్‌రోడ్డులో ఉన్న తమ ఇంట్లో ఓ పార్టీ ఏర్పాటు చేశారు. దానికి తమ సన్నిహితులను పిలిచారు. ఆ పార్టీకే బఫీ రావడం జరిగింది. పార్టీ అనంతరం అతను తిరిగి వెళ్లి 26 డిసెంబర్, 1919న కృతజ్ఞతలు తెలుపుతూ ఓ ఉత్తరం రాశాడు. అయితే అడ్రస్ సరిగ్గా లేకపోవడంతో దాదాపు తొమ్మిది దశాబ్దాల పాటు ఆ ఉత్తరం అక్కడా ఇక్కడా అని లేకుండా అన్ని చోట్ల తిరిగి తిరిగి బారెట్ గెస్ట్ హౌస్‌కి వచ్చి చేరింది.

ఈ సందర్భంగా బారెట్ మాట్లాడుతూ, ''ఇన్ని సంత్సరాల పాటు ఆ ఉత్తరం సుదీర్ఘ ప్రయాణం చేసి చివరికి ఇక్కడకు వచ్చి చేరింది. ఉత్తరం రాసిన వారు కానీ, దానిని అందుకోవలసిన వారు కానీ ప్రస్తుతం సజీవంగా లేరు. కానీ వారు ఇక్కడే ఉండేవారని అనుకుంటే మాత్రం చాలా థ్రిల్‌గా ఉంది'' అని చెప్పింది.

*

'సరసి'కత

# ఎలక్షన్లు

వైశంపాయనుడా రాత్రి నిద్రపోలేదు. తెల్లారితే ఎన్నికలు.

రాత్రంతా కాలనీలో చాలా హడావుడిగా వుంది. ఒక్కొక్క వీధిలో ఒక్కొక్క పార్టీ వాళ్లు టెంటు వేసి ఓటర్ల లిస్టు దగ్గర పెట్టుకుని బహుమతులు పంచసాగేరు.

స్టీలు బిందె పుచ్చుకుని అర్ధరాత్రి పన్నెండింటికి ఇంటికి వచ్చిన భర్తని కోప్పడింది భార్య సుబ్బాయమ్మ గారు. 'తప్పు కదూ' అంది ముక్కుమీద వేలేసుకుని. 'ఓసి పిచ్చిదానా' అన్నట్టు ఓ చూపు విసిరి, బయటి కెళ్లిపోయాడు వైశంపాయనుడు. ఓ గంట పోయాక ఓ చీర, ప్యాంటు పీసుతో తిరిగొచ్చాడు. సుబ్బాయమ్మ గారు చూడలేకపోయింది. ''నేను పడుకుంటున్నా. తియ్యనింక'' అంది బెడ్రూములోకి వెడుతూ.

''పడుకో. నేను బయట తాళం వేసుకు వెడతాలే'' అంటూ మళ్లీ బయటకు




పోయాడు వైశంపాయనుడు. ఈ సారి ఇస్త్రీ పెట్టెతో తిరిగొచ్చాడు. ఇంకోసారి డిన్నర్ సెట్టు, మరోసారి వెండి కుంకం భరిణె ఇలా రాత్రంతా కష్టపడి చాలా సామాన్లూ రొఖమూ ఇంటికి చేర్చాడు.

మర్నాడు ఓటు వెయ్యడానికి వెళ్లినపుడు బ్యాలెట్ పేపరులో పన్నెండు పేర్లు కనిపించాయి సుబ్బాయమ్మగారికి. అందులో ఒక్కరు కూడా ఆమెకు నచ్చలేదు. అంచేత ఎవరికీ ఓటు వేయకుండా ఖాళీ పేపరు మడిచి బాక్సులో పడేసి వచ్చిందామె.

వైశంపాయనుడు మాత్రం ఆ పని చెయ్యలేదు. మీకే వేస్తానని ప్రతి ఒక్కరికీ మాటిచ్చి బహుమతులందుకున్నాడు కాబట్టి, ఆ మాట నిలబెట్టుకుంటూ పన్నెండు మందికీ వేశాడు.

*